ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఎందుకీ దాపరికం?

- భూ సేకరణ నోటిఫికేషన్ రద్దుపై గోప్యత
- బాధితుల నిలదీతతో బహిర్గతం
- రోడ్డు విస్తరణ బాధితులకు టిడిఆర్‌లు అంటగట్టే యత్నం
- తామింకా నిర్ణయం తీసుకోలేదన్న వియంఆర్‌డిఎ
- పారిశ్రామికవేత్తల అవసరాలకు విస్తరణ
- చట్ట ప్రకారం పరిహారానికి బాధితుల పట్టు



భూ సేకరణ నోటిఫికేషన్(ఫైల్)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, ఉపాధి కోల్పోతున్న బాధితులతో ప్రభుత్వం ఆడుకుంటోంది. రోజుకో మాట చెబుతోంది. పరిశ్రమలకు విశాలమైన రహదారుల నిర్మాణం కోసం తీపికబుర్లు చెబుతున్న అధికారులు, నష్ట పరిహారం చెల్లింపుపై మానవీయత చూపడంలేదు. తనకు రాజకీయ బతుకుపెట్టిన ప్రజలను వదిలేసి పారిశ్రామికవేత్తల తరపున ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ వకల్తా తీసుకున్నట్లు మాట్లాడుతున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని బాధితులు ముక్తకంఠంతో కోరుతుంటే, వియంఆర్‌డిఎ ఇచ్చే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లు అమ్మే బాధ్యత తాను తీసుకుంటానని రెచ్చగొట్టేలా మాట్లాడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. 'తమ బాండ్లను ఎమ్మెల్యే అమ్మడమెందుకు? చట్టం ప్రకారం మాకాయన పరిహారం చెల్లిస్తే, మాకిచ్చే బాండ్లన్నీ విజయ్‌కుమార్‌కు ఇచ్చేస్తాం' అని బాధితులు అంటున్నారు.

2013 భూ సేకరణ చట్టం కింద పరిహారం, పునరావాసం చెల్లిస్తామని నోటిపైచేసి, గ్రామాల్లో టిడిఆర్ బాండ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించడంపై బాధితులు నిరసన తెలుపుతున్నారు. గ్రామ సభలు నిర్వహించి బాధితుల అభిప్రాయాలను తీసుకోకుండా టిడిఆర్‌లు తీసుకొనేందుకు ఒప్పించే ప్రయత్నం అధికారులు చేస్తున్నారు. బాధితులందరికీ సమాచారమివ్వాలన్న ప్రాథమిక పద్ధతిని పాటించడంలేదు. వాట్సాప్ గ్రూపులో సమాచారం పెడుతున్నారు. గ్రామంలో పలుకుబడి కల్గిన కొద్దిమందికి ఫోన్‌చేసి తెలియజేసి వచ్చిన వారితో మమ అన్పిస్తున్నారు. మునగపాకలో గురువారం ఉదయం 10.30 గంటలకు టిడిఆర్‌పై అవగాహన కార్యక్రమం ఉంటుందని తొలుత సమాచారమిచ్చి, అందరికీ సమాచారం ఇవ్వకుండానే ఒకరోజు ముందు బుధవారం నిర్వహించడంపై బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమం వాయిదావేయాలని పట్టుబట్టినా అధికారులు పట్టించుకోలేదు. మునగపాక

మిగతా 2లో..

విశాఖ పోర్టు రవాణాలో కొత్త సరుకు

- ఆఫ్రికాకు 1.1మిలియన్ టన్నుల బియ్యం ఎగుమతి
- బాక్సైట్, మాంగనీస్ ఓర్ పశ్చిమాఫ్రికా నుంచి దిగుమతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



వైజాగ్ పోర్టు 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ టన్నుల కార్గో హేండ్లింగ్ చేసి సరికొత్త రికార్డును స్థాపించడం వెనుక ఆఫ్రికాకు పోర్టు నుంచి ఈ సంవత్సరంలో 1.1మిలియన్ టన్నుల బియ్యం ఎగుమతులే కీలక పాత్ర పోషించాయి. అంతేగాకుండా బాక్సైట్, మాంగనీస్ ఓర్ పశ్చిమాఫ్రికాలోని గిన్నా ప్రాంతం నుంచి విశాఖ పోర్టుకు దిగుమతి కావడంతో కార్గో హేండ్లింగ్ ఒక్కసారిగా పెరిగిందని పోర్టు ఉన్నతాధికారులు తాజాగా వెల్లడించారు. మాంగనీస్ గిన్యా నుంచి 3.8 మిలియన్ టన్నులు, బాక్సైట్ (ఆఫ్రికా నుంచి) 1.7 మిలియన్ టన్నులు ఈ ఆర్థిక సంవత్సరంలో దిగుమతి అయ్యింది. బియ్యం అత్యధికంగా దేశంలోని ఛత్తీస్‌గడ్ రాష్ట్రం రాయపూర్ నుంచి విశాఖ పోర్టుకు రోడ్డు మార్గంలో రవాణా అవుతోంది. ఇక్కడ నుంచి ఆఫ్రికా ఖండానికి అత్యధికంగా బియ్యం ఎగుమతులు జరగడంతో కార్గో హేండ్లింగ్‌లో ఒక ఊపు వచ్చినట్టయింది. బియ్యం, బాక్సైట్, మాంగనీస్ ఓర్ సరికొత్త సరకుగా పోర్టు అధికారులు చెబుతున్నారు. థర్మల్ కోల్‌ను తొలినుంచీ పోర్టు హేండిల్ చేస్తున్న సంగతి తెలిసిందే.

మేజర్ పోర్టుల్లో అగ్రశ్రేణికి ఎదగడమే లక్ష్యంగా...

2025-26 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ టన్నుల కార్గో హేండ్లింగ్ లక్ష్యంగా వైజాగ్ పోర్టు దేశంలోని మేజర్ పోర్టులన్నిట్లోకి అగ్రశ్రేణిలో కొనసాగేందుకు కృషిని ప్రారంభించినట్లు ఇటీవలే పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ ఎగుమతులు కూడా పెరిగే అవకాశాలున్నాయన్నది తెలుస్తోంది. పోర్టు మొత్తంగా చూసినప్పుడు అవుటర్, ఇన్నర్ హార్బర్‌లన్నిటినీ ఆధునీకరించడంలో ప్రత్యేక కృషి చేసింది. మెకనైజేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైల్వే, కస్టమ్స్, పోర్టు ఉద్యోగులు, కార్మికులను సమన్వయం చేయడంలో కీలక పాత్రపోషిస్తూ వస్తోంది.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ రీ-టెండర్ రద్దు చేయాలి

▶ వార్త మెయిన్ 6లో..

విశాఖలో వైఎస్.జగన్‌పై ఫిర్యాదులు

▶ వార్త మెయిన్ 3లో..

లులూ ప్రాజెక్టును మరో ప్రాంతానికి మార్చండి

▶ వార్త మెయిన్ 3లో..

లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలోని జోన్ -1 పరిధిలో 27 టీంలు 81 మంది సిబ్బందితో ఏక కాలంలో 50 లాడ్జీలు, హోటళ్లలో బుధవారం తనిఖీలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. లాడ్జిలు, హోటళ్లలో తప్పిపోయిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? విదేశీ అతిథులు పాస్‌పోర్టు లేకుండా ఉన్నరా? మైనర్ అమ్మాయిలు బస చేయటం, వ్యభిచార కార్యకలాపాల నిర్వహణ వంటి అంశాలపై తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. హోటళ్లకు ఎన్ఒసి, ట్రేడ్ లైసెన్స్, జిఎస్‌టి సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అన్నది విచారించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఎవరైనా హోటల్‌లో పనిచేస్తున్నారా? మద్యం అమ్ముతున్నారా? అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజ్, విజిటింగ్ రిజిస్టర్లు

మిగతా 2లో..



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వ్యూహాత్మకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం

- డేటా బేస్ మేనేజ్‌మెంట్ ద్వారా ఆక్రమణల క్రమబద్ధీకరణ
- రెవెన్యూ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తాత్కాలిక, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, పారదర్శకత లోపించకుండా ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి రెవెన్యూ వర్క్ షాప్‌లో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. రెవెన్యూ పరమైన అన్ని అంశాలు, నిబంధనలు, ప్రభుత్వ జిఒలపై పైనుంచి కింది స్థాయి వరకు అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సవరణలు, మార్పులపై అప్ డేట్ అవుతూ ఉండాలని సూచించారు. ప్రజల అవసరాలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సరళతర విధానంలో ప్రక్రియలను నిర్వహించాలని హితవు పలికారు. వర్క్ షాప్‌లో భాగంగా ఆక్రమణల క్రమబద్ధీకరణ, భూముల బదలాయింపు, సర్వే, మ్యుటేషన్, రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్, కన్వేయన్స్ డీడ్, 22 ఎ జాబితా, ప్రభుత్వ భూముల ఆక్రమణ - చర్యలు, 27, 30, 296, 388 వంటి జిఒల అమల్లో అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రభుత్వ భూమి ఆక్రమణ క్రమబద్ధీకరణ పథకం 2025 ద్వారా వీలైనంత మందికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2019 అక్టోబర్ 15 కంటే

మిగతా 2లో..

కెజిహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం తన కార్యాలయానికి వచ్చే క్రమంలో ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఓపి కౌంటర్ల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. హెల్ప్ డెస్కు పనితీరు, కౌంటర్ల వద్ద సదుపాయాల స్థితిగతులను గమనించారు. అభ యాప్ ద్వారా ఓపి టికెట్ తీసుకునే విధానం, రోగులకు వైద్యులు, సిబ్బంది నుంచి అందుతున్న సహకారంపై ఆరా తీశారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓపి తీసుకునేందుకు ఎంత సేపు నిరీక్షిస్తున్నారు, హెల్ప్ డెస్కుల్లో ఉన్నవారు సహకారం అందిస్తున్నారా లేదా అనే అంశాలపై మాట్లాడారు. సిబ్బంది వ్యవహార శైలి, సదుపాయాలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో ఆయన వెంట కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆర్ఎంఓ డాక్టర్ మెహర్‌కుమార్ ఉన్నారు.



కెజిహెచ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశ్వనాథ్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలి

వార్వా, నివాస్ డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు ట్రస్ట్ యాజమాన్యం స్పందించి విశ్వనాథ్‌తో ఉన్న కాంట్రాక్టును రద్దుచేసి, పోర్టు స్టేడియాన్ని నగర ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, ఆట పాటలు, సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి డిమాండ్ చేశారు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లోని వాటర్ వరల్డ్‌లో ఆడుకుంటూ చిన్నారి రిషి మరణించడం ప్రతి ఒక్కరి మనసును కలచివేసిందని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా, ప్రమాద సమయంలో ఆదుకునే గార్డులను నియమించకుండా ప్రమాదకరమైన ఆటలు, ఫీజు అత్యంత నిర్లక్ష్యంగా ఏర్పాటుచేసిన విశ్వనాథ్ వైఖరిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నగరానికి వన్నె తెచ్చిన విశాఖ పోర్టు స్టేడియాన్ని ఒక ప్రయివేటు వ్యక్తికి ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వార్వా, నివాస్ గత ఏడాది ఆందోళన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే విశాఖ పోర్టు యాజమాన్యం, జివిఎంసి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విశ్వనాథ్‌తో కాంట్రాక్ట్ రద్దుచేయాలని డిమాండ్‌చేశారు.

చిత్రాలతో సమాజాన్ని చైతన్య పరచాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సందేశాత్మక చిత్రాల ద్వారా సమాజాన్ని చైతన్య పరచాలని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ కోరారు. కోర్టు చిత్ర దర్శకుడు రామ్ జగదీష్ బుధవారం ప్రణవ్‌గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ జగదీష్‌ను ప్రణవ్‌గోపాల్ సత్కరించారు. మొదటి సినిమాతోనే మంచి దర్శకునిగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ జగదీష్ భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు చేయాలని ఆకాంక్షించారు. మంచి కథ, కథనం ఉన్న చిత్రాలకు ఆదరణ లభిస్తోందని అన్నారు.

'పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తన వద్ద రూ.25 లక్షలు తీసుకొని మోసం చేశాడని కొత్తూరు నరేంద్రపై ఫిర్యాదు చేయగా, న్యాయం చేయకుండా తనపట్ల గాజువాక పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తన వలె అనేక మంది నుంచి డబ్బు తీసుకొని నరేంద్ర మోసగించినట్లు ఫిర్యాదులు రావడంతో మాట్లాడేందుకు బాధితులతో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లానని చెప్పారు. ఆ సమయంలో అక్కడే ఉన్న నరేంద్ర తన పట్ల అసభ్యకరంగా మాట్లాడడంతో చెప్పుతో కొట్టానని చెప్పారు. మార్చిలో జరిగిన ఈ ఘటన వీడియోను పోలీసులు ఎవరి ఒత్తిడితో ఇప్పుడు విడుదల చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. తనలాగా మోసపోయిన బాధితుల తరుపున పోరాడుతుంటే తనపై అక్రమ కేసులు పెడుతున్నారని మండి పడ్డారు. తాను సివిని ట్రాన్స్ ఫర్ చేస్తానని అనలేదని వివరణ ఇచ్చారు. ఇప్పుడు నామినేటెడ్ పోస్టు వస్తుందని, కొంత మంది తనపై కుట్రచేశారని ఆరోపించారు.

ఇగ్నో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన లాసన్స్ బే కాలనీలో ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుమారు 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇగ్నో ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామని ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సుధాకిరణ్, వివి పతిరావునాయుడు, వి.వెంకటరమణ పాల్గొన్నారు.

అందుబాటులోకి కార్డ్‌లెస్ స్టిక్ వ్యాక్యూమ్ క్లీనర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెలలో జరిగిన 'వెల్‌కమ్ టు బెస్పోక్ ఎఐ గ్లోబల్ ఈవెంట్'లో సామ్‌సంగ్ ఆవిష్కరించిన కార్డ్‌లెస్ స్టిక్ వాక్యూమ్ క్లీనర్‌ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ డిజిటల్ ఉపకరణాల ఆర్ అండ్ డి బృందం అధిపతి ఈవీపీ జియోంగ్ సీయింగ్ మూన్ స్థానిక మీడియాకు తెలిపారు. క్లీనింగ్ మోడ్ 2.0, అధునాతన హెపా వడపోత వ్యవస్థతో అత్యంత శక్తివంతమైన మోడల్ అన్నారు. ఈ కొత్త మోడల్ ప్రపంచ మార్కెట్లో నిజమైన గేమ్ ఛేంజర్ అవుతుందని పేర్కొన్నారు.

మహిళా కళాశాలకు హెచ్‌పిసిఎల్ విరాళం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి నిమిత్తం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హెచ్‌పిసిఎల్ రూ.50 లక్షల విరాళం అందించింది. ఈ మేరకు ఆ సంస్థ సిజిఎం జి.కిరణ్‌కుమార్, విశాఖ రిఫైనరీ ఈడీ ఆర్.రామకృష్ణన్, సిపిజెడ్ఓ శ్రీనివాసరావు బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కలెక్టరేట్‌లో కలిసి చెక్కును అందజేశారు. మహిళా కళాశాలలో టాయిలెట్ బ్లాక్ ఆధునికీకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపయోగించాలని కళాశాల అధికారులకు కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపల్ మంజుల, సిపిఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న హెచ్‌పిసిఎల్ అధికారులు

మొదటి పేజీ తరువాయి..

ఎందుకీ దాపరికం?

పంచాయతీ భవనంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గతంలో నోటిపై చేసిన 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారానికి తప్ప టిడిఆర్ బాండ్లకు అంగీకరించేదిలేదని అనకాపల్లి ఆర్‌డిఓ షేక్ అయిషాకు బాధితులు చెప్పారు. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం వాస్తవం చెప్పడంలేదు. అధికారులు చెబుతున్న మాటల్లో ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలియనిస్థితి నెలకొంది. గతంలో 2013 భూ సేకరణ చట్టం కింద జారీచేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. తనచేతి డబ్బులు ఇవ్వకుండా విఎంఆర్‌డిఎతో టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ విధానంలో భాగంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద పారిశ్రామికవేత్తల అవసరాలను వేగంగా తీర్చడానికి రోడ్డు విస్తరణ పనులు చేపడుతుంది. టిడిఆర్ బాండ్ల జారీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని విఎంఆర్‌డిఎ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు పట్టణాలు, కార్పొరేషన్ల పరిధి దాటి ఇచ్చే టిడిఆర్‌లకు న్యాయపరమైన చిక్కులపై విఎంఆర్‌డిఎ ఆలోచిస్తోంది. రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం లేకుండా చేసుకొనే పనిలో మంచిచెడు ఆలోచించకుండా ప్రభుత్వం చెప్పినట్లు అధికారులు చేసుకుపోతున్నారు. ప్రభుత్వ ఒత్తిళ్లను భరించలేక రోడ్డు విస్తరణ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులు చూస్తున్నారుగానీ, బాధితుల వాస్తవ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేయడంలేదు. ఆర్అండ్‌బి స్థలంలోని నిర్మాణాలకు నగదు కింద పరిహారం చెల్లిస్తామని చెబుతూనే వాటిని తొలగిస్తున్నారు. గతంలో జారీచేసిన భూ సేకరణ నోటిఫికేషన్ రద్దుపై గోప్యంగా ఉంచిన అధికారులు, గతంలో అంగీకారం ప్రకారం పరిహారమివ్వాలని బాధితుల నిలదీతతో ఆ నోటిఫికేషన్ రద్దయినట్లు వెల్లడించారు.

వ్యూహాత్మకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం

ముందు ఆక్రమించుకున్న వారికి ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు గురించి తెలపాలని సూచించారు. గాజువాక ప్రాంతంలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ గురించి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 30 (296,388) ఆధారంగా ప్రక్రియలను త్వరితగతిన చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి చెప్పారు. జిల్లాలో ఇప్పటికే ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. కన్వెయన్స్ డీడ్ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, దీనికి రిజిస్ట్రేషన్ శాఖ సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్ఐసి సహాయంతో డేటా బేస్ మేనేజ్‌మెంట్ నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని, ఫ్లాట్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వివిధ సమస్యలను తహశీల్దార్లు, డిటిలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇనాం, దేవాదాయ శాఖ పరిధిలోని భూముల విషయంలో వివరాలు సరిపోలటం లేదని, జిఓ 30, 296, 388 అమల్లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. 22 ఎ జాబితాలను వెబ్ ల్యాండ్‌లో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు తహశీల్దార్లు సూచించగా ప్రభుత్వానికి నివేదించి తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ బదులిచ్చారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి బాలకృష్ణ, భీమిలి, విశాఖపట్టణం ఆర్‌డిఓలు సంగీత్ మాధుర్, పి.శ్రీలేఖ, సర్వే శాఖ ఎడి సూర్యారావు, కలెక్టరేట్ ఎఓ ఈశ్వరరావు, ఎన్ఐసి అధికారి పాషా తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

గంజాయి, ఆయుధాలు మందుగుండు సామాగ్రి తదితర అంశాలపై తనిఖీలు చేసినట్లు వివరించారు.

ఈ తనిఖీల్లో భాగంగా 13 భవనాలకు అగ్నిమాపక ఎన్ఓసిలు లేవని, తొమ్మిదింటికి ట్రేడ్ లైసెన్సులు లేవని, మరో తొమ్మిదింటికి ఎఫ్ఎస్ఎస్ ఎఐ లైసెన్స్ లేదని, పదింటికి జిఎస్‌టి సర్టిఫికెట్లు లేవని, ఆరు హోటళ్లలో సందర్శకుల రికార్డు సరిగా లేదని పోలీసులు గుర్తించారు. వీరందరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖలకు నివేదికలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు

నేడు మాంసం దుకాణాలకు సెలవు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహావీర్ జయంతి సందర్భంగా గురువారం జివిఎంసి పరిధిలో జంతువధశాలలు, మటన్, చికెన్, చేపల దుకాణాలకు సెలవు ప్రకటించినట్లు నగర పశు నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విరుద్ధంగా దుకాణాలు తెరిచినా, మాంసాన్ని అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరంతర ప్రక్రియగా రుణమేళాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కల్పనకు రుణమేళాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించనున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. బుధవారం 13వ వార్డులో నిర్వహించిన బిసి రుణ మేళా ఇంటర్వ్యూలకు స్పందన లభించింది. 9నుంచి 13 వార్డుల పరిధిలో 1200 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 900 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. యుసిడి, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి, జాబితాలను బ్యాంకులకు పంపిస్తామన్నారు. జెడ్‌సి కనక మహాలక్ష్మి, కార్పొరేటర్లు కెల్ల సునీత సత్యనారాయణ, మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, టిడిపినేతలు ఒమ్మి సన్యాసిరావు, పొత్రకండ ధర్మారావు, మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, ఏడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు, బాలస్వామి, రాగతి అచ్యుతరావు, మాసాబత్తుల శ్రీనువాసరావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 6వ వార్డు రామాలయం వద్ద కమిటీ హాల్ వద్ద నిర్వహించిన బిసి కార్పొరేషన్ రుణమేళాలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 1700 మంది దరఖాస్తు చేసుకోగా, పలువురు ఇంటర్వ్యూకు వచ్చారు.బ్యాంకుల్లో ఎటువంటి రుణాలు లేకుండా, సిబిల్ స్కోర్ బాగున్న వారికి మొదటి ప్రాధాన్యతగా స్వయంఉపాధి రుణాలు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, జెడ్‌సి కనకమహాలక్ష్మి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, జనసేన వార్డు ప్రెసిడెంట్ సంతోష్ నాయుడు గరే గురునాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస :ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన 2024 -25 మొదటి సెమిస్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాల్లో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి బోటనీ, జువాలజీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బిఎ హిస్టరీ ఆనర్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీవాణి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్‌లో 100 శాతం, జువాలజీలో 96, బోటనీలో 95శాతం, కెమిస్ట్రీ , మ్యాథ్స్‌లో 90శాతం చొప్పున, హిస్టరీలో 80 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించి ఇదే ఒరవడి కొనసాగించాలని ఆకాంక్షించారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘననివాళి

ప్రజాశక్తి -మధురవాడ : సిపిఐ పూర్వ జాతీయ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. చంద్ర చిత్రపటానికి మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎం.అప్పారావు, మహేష్, రామకృష్ణ, షేక్ తానీసా,రమణ, రాంబాబు పాల్గొన్నారు.

గాజువాక : పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో సిపిఐ నాయకులు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ నివాళులర్పించారు నాయకులు జి.ఆనంద్, కె. అచ్యుత రావు, పల్లేటి పోలయ్య, పి. దుర్గారావు , కె. పోతయ్య, సోమేష్, మాధవరావు , అప్పారి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అల్లిపురంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళు లర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎ.విమల, సిఎన్.క్షేత్రపాల్, జి.కాసులరెడ్డి పాల్గొన్నారు.

బొట్టా నర్సింగరావు ఆశయ సాధనకు కృషి

- బిఎన్ఆర్ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



బిఎన్ఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రజా పోరాట వీరుడు బొట్టా నర్సింగరావు ఆశయసాధనకు పనిచేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. బుధవారం కంచరపాలెం సిఐటియు కార్యాలయంలో బిఎన్ఆర్ 21వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, ఆంధ్ర స్టీల్‌లో సాధారణ కార్మికుడిగా పనిచేస్తూ, అక్కడ కష్టాలు పడుతున్న కార్మికులకు సంఘం ఏర్పాటుతో ప్రారంభమైన నర్సింగరావు ప్రస్థానం కంచరపాలెంలో మహానేతగా ఎదిగే వరకు వెనుదిరిగి చూడలేదన్నారు. కష్టజీవులు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి, సమసమాజ స్థాపనకు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. 2004లో చిరుప్రాయంలోనే నర్సింగరావు చనిపోయినా, ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ పనిచేస్తున్న సభ్యులు, కార్యకర్తలను అభినందించారు. బిఎన్ఆర్ స్ఫూర్తితో మరింత పట్టుదల, చైతన్యంతో పనిచేయాలని, సమస్యలపై ప్రజల్ని కదిలించి పోరాటాలకు సమాయత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, పార్టీ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం ఈశ్వరరావు, ఎస్ అప్పలరాజు, బుజ్జి, ఎస్ సోమేశ్వరరావు, పి వెంకటరావు, ఎస్ వెంకటరావు, సిహెచ్ సుమిత్ర, పి మూర్తి, జి శ్రీను పాల్గొన్నారు

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి : ఎపిసి

ప్రజాశక్తి-ఆనందపురం : బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి జోగా చంద్రశేఖరరావు అన్నారు.. బుధవారం బొడ్డపాలెం, వేములవలస ఎస్‌సి కాలనీ ఎంపిపి పాఠశాలల పరిధిలో డ్రాపౌట్ పిల్లల వెరిఫికేషన్‌ను పరిశీలించారు. బొడ్డపాలెంలో ఒకరు, వేములవలస ఎస్‌సికాలనీలో ఇద్దరు డ్రాపౌట్ పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి విద్యార్థి లాంగ్వేజెస్‌లో రీడింగ్, రైటింగ్ స్కిల్స్ మెరుగుపరుచుకునేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వేములవలస కాలనీలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల సంఖ్య పెంచాలని సూచించారు. ఐదేళ్ళ నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఆనందపురం ఉన్నతపాఠశాలలో పిఎంశ్రీ నిధులతో చేపడుతున్న మైదానం అభివృద్ధి పనులను పరిశీలించి, సకాలంలో పూర్తిచేయాలని ఎఇ శ్రీనివాస్, హెచ్‌ఎం కెఆర్‌కె.పట్నాయక్,పిడి ప్రసాద్‌లకు సూచించారు. ఎంఇఒ జోగేంద్రనాథ్, సిఆర్‌పి షిణగం శివాజీ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- ఏడు లారీలు సీజ్ : రూ.2.50లక్షల జరిమానా విధింపు
- క్వారీ లారీల యూనియన్ ప్రతినిధుల సమాచారంతో రవాణాశాఖ చర్యలు



ఇసుకతో పట్టుబడిన లారీల వద్దయూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఆనందపురం: ఫేక్ వేబిల్లులు, ఓవర్ లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న లారీలను క్వారీ లారీ ఓనర్స్ యూనియన్ ప్రతినిధులిచ్చిన సమాచారంతో ఆర్‌టిఒ అధికారులు పట్టుకున్నారు. బుధవారం వేములవలస పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీకాకుళం నుంచి ఓవర్‌లోడుతో వస్తున్న ఏడు ఇసుక లారీలను పట్టుకుని సీజ్ చేసి, వారి నుంచి రూ.2.50లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు. అక్రమంగా ఇసుకు రవాణా చేస్తున్న ఇసుక లారీలను యూనియన్ ప్రతినిధులు అడ్డుకుని నిలదీయగా, వారితో వాగ్వాదం జరగడంతో రవాణాశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు స్పందించి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఫేక్‌బిల్లులు, ఓవర్‌లోడ్‌తో కొందరు ఇసుక రవాణా చేస్తుండగా, అధికారులు తూతూమంత్రంగా పరిశీలనలతో వదిలేస్తున్నారని, పలుకుబడి ఉన్న కొందరిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్నారు. అధికారులు అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్వారీ లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బొట్టా సురేష్, వైస్ ప్రెసిడెంట్ బొట్ట సురేష్‌మార్, కొయ్య శ్రీను, కన్వీనర్ మద్దిల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ ఆవాల రామకృష్ణ, మాజీ అధ్యక్షులు అయ్యప్ప, ఆనందపురం సింహాద్రి లారీ ఓనర్స్ యూనియన్ అధ్యక్షులు బంక శ్రీను, సెక్రటరీ కోరాడ శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

మురికికూపంలా మల్కాపురం

- చిన్నపాటి వర్షానికే వీధులు, ఇళ్లలోకి మురుగునీరు
- దుర్వాసనతో జనం అవస్థలు : శాశ్వత పరిష్కారానికి వినతి



మల్కాపురంలో ఇళ్లు, వీధుల్లోకి చొరబడిన మురుగునీరు

ప్రజాశక్తి ములగాడ : చిన్నపాటి వర్షానికే జివిఎంసి 61వ వార్డు మల్కాపురంలోని పలుప్రాంతాలు మురికికూపంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం వేసవి సీజన్‌లో కురిసిన కొద్దిపాటి వర్షానికి గ్రామంలోని మరిడి మాంబ కళ్యాణ మండపం, పల్లవీధి, గొల్ల వీధి, తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లోకి మురుగునీరు చేరడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మల్కాపురంపైన కొండ ప్రాంతంలో కురిసిన వర్షపునీరు, అక్కడ నుంచి కింద వరకు ఉన్న చెత్తాచెదారంతో కలిసి పెద్దగెడ్డలోకి చేరుతోంది. అయితే పెద్దగెడ్డలో ఇనుప ఊచలతో జాలీ పెట్టడం వల్ల వ్యర్థాలన్నీ దానిలో ఇరుక్కుపోవడంతో నీరంతా ఎగపోటు కట్టి వీధుల్లోకి, ఇళ్లల్లోకి చేరుతోంది. మురుగుకాలువల్లోని నీరంతా ఇళ్లల్లోకి చేరడంతో దుర్వాసనతో జనం ఇబ్బందులు పాలయ్యారు. మామూలుగా ఉన్నప్పుడే డ్రైనేజీలు పూడుకుపోయి, దుర్గంధం, వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఇలా వర్షం కురిస్తే కష్టాలు మరింత ఎక్కువవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలోఅనేకసార్లు స్థానికులు పోరాటాలు చేయగా స్థానిక అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారనిస్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, శాశ్వతప్రాతిపదికన మురుగుసమస్యకు చెక్ చెప్పాలని సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఉరుకూటి.బాబూరావు, ఏరియా కార్యదర్శి నమ్మి ఉమా, విజయ మహలక్ష్మి జివిఎంసి అధికారులను కోరుతున్నారు. మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద పల్లివీధి, గొల్లవీధి ప్రజలకు మురుగుకష్టాల నుంచి విముక్తి కల్పించాలన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్నకాలనీలో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. టౌన్ సిఐ గోవిందరావు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్న కాలనీలో మంగళవారం రాత్రి తలుపులమ్మ తల్లి పండగ జరిగింది. జాతర జరుగుతున్న సమయంలో చిత్రాడ మహేష్, రుత్తల ప్రసాద్ మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. ప్రసాద్‌ను కత్తితో మహేష్ పొడిచి హత్య చేశాడు. ఇదే సమయంలో అడ్డుగా వచ్చిన మరో యువకుడికి కూడా గాయాలయ్యాయని సిఐ తెలిపారు. నిందితుడు మహేష్ పరారయ్యాడని, గాలిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని విలస్‌ఖాన్ పాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వానపల్లి వెంకటరమణ రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మంగళవారం సాయంత్రం విజయనగరం నుండి పద్మనాభం వైపు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో రామనారాయణం టెంపుల్ వద్ద ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే విజయనగరంలోని ప్రయివేటు ఆసుపత్రికితరలించినా, బుధవారం ఉదయం చికిత్స పొందుతూ ఆరోగ్య విషమించి మృత్యువాత పడ్డారు. బుధవారం పద్మనాభంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికిఇద్దరు పిల్లలున్నారు.

విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులపై కేసు

ప్రజాశక్తి- సీతమ్మధార.:విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకుల నిర్లక్ష్యం మూలంగానే బాలుడు మతి చెందాడని, ఈ కేసులోక్లబ్ ప్రధాన నిర్వాహకుడు కాశీ విశ్వనాథ్‌పై కేసు నమోదు చేశామని ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి తెలిపారు. బుధవారం సాయంత్రం 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 7న సాయంత్రం ఆక్వా స్పోర్ట్స్ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంలో విశ్వనాథ స్పోర్ట్స్ యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా ఉందన్నారు. ఆక్వా స్పోర్ట్స్ క్లబ్ నిర్వహణలో యాజమాన్యం కనీస భద్రత నియమాలు పాటించలేదని,సమయం దాటిన తర్వాత టిక్కెట్లు అమ్మకాలు జరిపారన్నారు. తల్లిదండ్రులను ఆక్వా కాంప్లెక్స్ సమీపానికి అనుమతించడం లేదని తాము విచారణలో గుర్తించామని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే కాపాడేందుకు లైఫ్ సేవింగ్ సిబ్బంది అందుబాటులో లేరన్నారు. ఆక్వాస్పోర్ట్స్ నిర్వహణకు అనుమతులను నిర్వాహకులు స్పష్టంగా చూపించడం లేదన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ఎ.సత్యనారాయణ, ఎస్ఐ చిన్నం నాయుడు పాల్గొన్నారు.

ఎంసి చైర్మన్‌కు అభినందన



రామస్వామినాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- పద్మనాభం : కూటమి ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను అందిపుచ్చుకుని, అందరికీ అందుబాటులో ఉండి సమర్థవంతంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలి వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కె.రామస్వామినాయుడు బుధవారం ఎమ్మెల్యే గంటాను అతని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందించిన గంటా, ప్రజలు మెచ్చే విధంగా పనిచేయాలని, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్, బూత్ కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ బివి నాయుడు మండల ప్రధాన కార్యదర్శి ఎం.సువారప్పుడు, ఉపాధ్యక్షులు. సంతోష్, ఆనందపురం భీమిలి మండలాల కూటమి పార్టీలఅధ్యక్షులు పాల్గొన్నారు.

'విశాఖ'లో ఉచిత పాలిసెట్ శిక్షణ

ప్రజాశక్తి- వేపగుంట :నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ పి.ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. పాలిటెక్నికల్ ప్రవేశపరీక్షకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోకపోతే తమ కళాశాలలో ఉచితంగా దరఖాస్తుల అందజేస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులను వినియోగించుకుని మంచి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ జి. సత్య నారాయణ, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

కళారత్న పురస్కార గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి- ములగాడ : కళారత్న పురస్కార గ్రహీత సుంకర చలపతిరావును బుధవారం స్థానిక శాఖాగ్రంథాలయంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ అధ్యక్షతన అభినందన సభలో ముఖ్యఅతిథి పౌర హక్కుల సంఘం అధ్యక్షులు జిల్లా టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, రచయిత, పరిశోధకుడు, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త, విమర్శకునిగా చలపతిరావు బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు. ప్రజా వైద్యులు డాక్టర్ పి.హేమలత, ఎన్‌సిసి జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రకాశరావు, చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్, శివ, మహేష్ పాల్గొని చలపతిరావును అభినందించారు.

భెల్ కార్మికులకు బహుమతులు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ కార్మికులకు సంస్థ యాజమాన్యం బుధవారం స్టీల్‌వాటర్ బాటిళ్లను బహుమతిగా అందజేసింది. ఏటా కార్మికులకు ఇస్తున్న సావనీర్ బహుమతుల్లో భాగంగా ఈ ఏడాది జనవరిలో ఐదు లీటర్ల ప్రెజర్ కుక్కర్లను అందజేయగా, ఇపుడు స్టీల్ వాటర్‌బాటిళ్లను అందజేసింది.సంస్థ సీనియర్ మేనేజర్(హెచ్ఆర్) జి చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బొండా బాబూరావు, సుధాకర్ సాహు, కొల్లి దేముడు, ఏ వెంకటరావు, ఖలీల్, డి. మోహన్‌దాస్ పాల్గొన్నారు

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన నిర్వాసితులందరికీ నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెవిన్యూ అధికారులకు సూచించారు. మండలం తర్లువాడ గ్రామంలో 2002లో బంజరు భూముల అభివృద్ధి పథకం కింద 500 మందికి సుమారు 100 ఎకరాల భూమిని కేటాయించారు. ఐటీ హబ్ కోసం ఆ గ్రామంలో 200 ఎకరాలను ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే 100 ఎకరాల డి పట్టా భూములను అధికారులు సేకరించారు. దీనిపై బుధవారం ఆ ప్రాంతంలో ఆర్‌డిఒ కె. సంగీత్ మాధుర్, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, నిర్వాసిత రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే, 100 ఎకరాల్లోని 500 మంది రైతులకు కూడా నష్టపరిహారాన్ని ఇవ్వాలని చెప్పారు. రైతులందరూ 20 సెంట్లు, 30 సెంట్ల భూములున్న వారేనని, వారిని మానవతాదృక్పథంతో న్యాయం చేయాలన్నారు. తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, తాత్రాజు అప్పారావు, మజ్జి శ్రీను, బంక్ రాజు, బాల అయ్యప్ప పాల్గొన్నారు.

16న సెంట్రల్ జైల్‌లోని పశువుల వేలం

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారంలోని డెయిరీలో ఉన్న 14 పశువులను ఈ నెల 16న ఉదయం 10 గంటలకు జైలు పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు సెంట్రల్ జైల్ పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆవు, గేదె, ఐదు ఆడదూడలు, ఏడు మగ దూడలు వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, హెచ్చుపాటదారుడు ఒకేసారి డబ్బులు చెల్లించి పశువులను పొందవచ్చన్నారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార: సాయి సుస్వరవాణి సాంస్కృతిక భక్తి లలిత సంగీత సంస్థ ఎం.రత్నకుమారి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో 'శ్రీరాముని చరితమును తెలిపెద మమ్మ' పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కళారంగ ప్రముఖులు సన్ మూర్తి, ఉషా చీరాల, మిస్సుల రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కార్యక్రమంలో గాయకులు సివి రాజేశ్వరి, పావని, రంజిత, రాధ, మెలోడీ సత్యనారాయణ, మాధవ్, ప్రభాకర్, పుండరీ కుమార్, కడలి, అరుణ కుమార్, రమేష్, పత్తి ప్రసాద్, రాము, రాజ శేఖర్, మంజుల తమ గానంతో అలరించారు.

ఇళ్ల పట్టాల మంజూరులో నిర్లక్ష్యం



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు
- ప్రజా చైతన్యయాత్రల సమస్యలపై సిపిఎం ధర్నా
- 296, 388 జిఒల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాలి
- జిఒ30లో అర్హులకు కొత్త పట్టాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ :పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇళ్లపట్టాల మంజూరులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మండిపడ్డారు. బుధవారం ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్య పరిష్కారానికి విశాఖ రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి నిరసన చేశారు.. ముందుగా డెయిరీఫాం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నినాదాలు చేస్తూ భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో జగ్గునాయుడు మాట్లాడుతూ, మధురవాడ, ఆరిలోవ ప్రాంతాల్లో లక్షలాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలకు 2015, 2017ల్లో 296, 388 జిఒల ప్రకారం ఇళ్లపట్టాలను ఇచ్చిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, నేటివరకు వాటికి రిజిస్ట్రేషన్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. జిఒ 30 ప్రకారం అర్హులైన పేదలందరికీ కొత్తగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయకపోడంపై మండిపడ్డారు. గత వైసిపి పాలనలో పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తామని హడావిడి చేసినా నమ్మించి మోసగించడంతో, కూటమి పార్టీని గెలిపించారని, ఇపుడు కూటమి పార్టీ తాత్సారం చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి. కుమార్ మాట్లాడుతూ గెడ్డలు, కాలువలు, వివాద స్థలాల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు జారీకి నిరాకరిస్తున్న ప్రభుత్వం, భూ కబ్జాదారులకు, రాజకీయ అండదండలున్న వారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పట్టాలిచ్చి, రిజిస్ట్రేషన్లకు సహకరించడం అన్యాయ మన్నారు. సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కష్టారావు, జోన్ కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, బి.భారతి, డి.కొండమ్మ, డి.నాగరాజు, పి.శంకరరావు, పి.వెంకటరావు, కె. కుమారి, కాంత, సుజాత, మణి, పుష్ప, రమణమ్మ పాల్గొన్నారు.


వేపగుంట : అర్హులైన పేదలకు జిఒ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లానాయకులు, 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రజా చైతన్యయాత్రల్లో సేకరించిన సమస్యల పరిష్కారానికి గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.
. ఈ సందర్భంగా గంగరావు మాట్లాడుతూ, 2019కి ముందు ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలం దరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రియల్టర్లు, కొంతమంది ధనవంతులు పేదల నివసించే ప్రాంతాలను ఆక్రమించుకోవడానికి దొంగ పత్రాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. జిఒ30 కింద దరఖాస్తు చేసిన నెలరోజుల్లో పట్టాలివ్వకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, జోన్ నాయకులు బి వెంకటరావు, రమణి, ఒ అప్పారావు, అనసూయ, ఎంతఈశ్వరరావు, శ్రావణ్, జి శ్రీను పాల్గొన్నారు

రిక్షా కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి

గాజువాక: జిఒ 30 ప్రకారం జివిఎంసి 76వ వార్డు రిక్షా కాలనీ ప్రజలకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నేతలు కోరారు. బుధవారం గాజువాక డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాంబాబు, వెంకటరావు మాట్లాడుతూ...రిక్షా కాలనీలో 40ఏళ్లుగా జీవిస్తున్న వారికి ప్రభుత్వం తరపున సిసి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలతోపాటు పేదల నివాసముంటున్న ఇళ్లకు పన్నులు వసూలు చేస్తున్నా, నేటికీ వారికి పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే గంగవరంపోర్టు, ఇతర కాలుష్యంతో బాధపడుతున్న ప్రజలకు విముక్తి కల్పించాలని కోరారు.కార్యక్రమంలో డి,రమణ.బి రమణ, వెంకయ్య, సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గోపాలపట్నంలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు


గాజువాకలో డిటికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

జగన్ తీరు మారాలి : పల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గాజువాక : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడే భాష, తీరును మార్చుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హితవు పలికారు. బుధవారం 72వ వార్డు శ్రీనగర్‌లో 'క్యాడర్ విత్ లీడర్' కార్యక్రమంలో కార్యకర్తలతో మాట్లాడుతూ, కుట్రలు, కుతంత్రాలు, అవినీతి, అరాచకాలు, కక్ష సాధింపులతో ఐదేళ్ల ప్రజాకంటక పాలన సాగించిన జగన్, వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పటికీ అదే తీరు కొనసాగించాలని చూస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాలతో ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజారంజకంగా సాగుతున్న కూటమి పాలన మరో రెండు దశాబ్దాలు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చ విజయ్‌కుమార్. 67వ వార్డు ఇన్‌ఛార్జి అక్కిన లక్ష్మణరావు. బిసి సెల్ జిల్లా అధ్యక్షులు తమ్మిని విజయకుమార్. సాలాపు రామారావు

1085 మంది దివీస్ ఉద్యోగుల రక్తదానం


రక్త దానం చేస్తున్న దివీస్ ఉద్యోగులు

ప్రజాశక్తి -తగరపువలస :భీమిలి మండలం, చిప్పాడ, దివీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ పరిపాలనా విభాగం వద్ద నిర్వహించిన మెగా రక్త దాన శిబిరంలో 1085 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు.ఎన్‌టిఆర్, లైఫ్ షేర్, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రెడ్‌క్రాస్, రోటరీ, న్యూ లైఫ్, ఎఎస్ రాజా, విశాఖ ఎస్‌విఎస్ తదితర బ్లడ్ బ్యాంక్‌ల సౌజన్యంతో నిర్వహించిన రక్తదానశిబిరంలో సంబంధిత సిబ్బంది రక్తాన్ని సేకరించారు.
సంస్థ జనరల్ మేనేజర్ సత్యచంద్ర దివి జ్ఞాపకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సంస్థ డైరెక్టర్ ఎస్ దేవేందర్‌రావు మాట్లాడుతూ, సత్యచంద్ర దివి జ్ఞాపకార్థం 12 ఏళ్లుగా ఏటా వెయ్యి మందికి పైగా తమ సంస్థ ఉద్యోగులు రక్త దానం చేస్తున్నారన్నారు. రక్తదాతలను అభినందిస్తూ, రక్త దానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల ను వివరించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు,రమేష్‌బాబు, రామకృష్ణ, నాగార్జున, డిజిఎం, ప్రభాకర్, ప్రతినిధులు మహేంద్ర, మల్లికార్జున, నరసింహ పాల్గొన్నారు.

200 అడుగులకు రోడ్డు విస్తరణ వద్దు

- తహశీల్దార్ కార్యాలయంవద్ద బాధితుల ధర్నా, వినతి


సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- ఆనందపురం : తమను ఇబ్బందులకు గురిచేసే, రోడ్డున పడేయడానికే తప్ప మండలంలోని వేములవలస పంచాయితీ భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి భీమునిపట్నం గొల్లలపాలెం వరకు రోడ్డును 200 అడుగులకు విస్తరించాల్సిన అవసరం లేదని బాధిత రైతులు, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ చైతన్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, వియంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా రూపొందించిన విధంగా భీమిలి క్రాస్ రోడ్డు నుంచి గొల్లలపాలెం వరకు 200 అడుగులు రోడ్డు విస్తరణకు నోటీసులు జారీ చేశారన్నారు. ఈమార్గంలో 200అడుగులకు రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం లేదన్నారు. అలా జరిగితే భీమిలి క్రాస్ రోడ్డు నుంచి బొడ్డపాలెం, గొల్లలపేట, మన్యాపేట తదితర ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారాలతో జీవనం సాగిస్తున్న 200 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. గతంలో ప్రకటించిన విధంగా వంద అడుగులకు రోడ్డు వెడల్పుచేస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆందోళనలో ఐద్వా నేత కె.నాగరాణి, ఆర్ వీరన్న, ఎస్ శంకర్, జి.రమణి, సిహెచ్ అమ్మాజీ, బి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -గాజువాక: శీలానగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గాజువాకలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నంబారు రాజు, బొడ్డు చిన్న అప్పలస్వామి, నంబారు రమణ, జక్కు కొండలరావు, తుమ్మలచెర్ల భద్రాచలం, చరపాక నాగార్జున రాజు పాల్గొన్నారు.

వ్యర్థ రసాయనాలు పీల్చి కార్మికుడు మృతి

- ఫార్మా కంపెనీల డ్రమ్ములు శుభ్రం చేస్తూ అస్వస్థతకు గురైన వైనం
- మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్



యాజమాన్యాన్ని నిలదీస్తున్న సిఐటియు నేత గనిశెట్టి



హరినాథ్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పరవాడ

మండల కేంద్రం పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ కూతవేటు దూరంలో ఉన్న తుక్కు దుకాణంలో ఫార్మా వ్యర్థ రసాయనాలు పీల్చి ఒక కార్మికుడు మృతి చెందాడు. బుచ్చయ్యపేట మండలం నీలకంతాపురం గ్రామానికి చెందిన పడాల హరినాథ్ (24) తుక్కు దుకాణంలో పని చేస్తున్నాడు. తుక్కు దుకాణంలో ఫార్మా పరిశ్రమలకు చెందిన వ్యర్థ రసాయనిక డ్రమ్ములను మంగళవారం క్లీన్ చేస్తూ వ్యర్థ రసాయనాలను పీల్చడంతో హరినాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయన్ను విశాఖలోని ఓ ప్రేవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున హరినాథ్ మతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని కుటుంబీకులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారంపై యాజమాన్యంతో గనిశెట్టి చర్చలు జరిపినా ఫలించలేదు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి ఫార్మా డ్రమ్ములను తుక్కు దుకాణానికి సరఫరా చేస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ఏ ఫార్మా యాజమాన్యం అయితే తుక్కు దుకాణానికి డ్రమ్ములు సరఫరా చేసిందో ఆ యాజమాన్యం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

నీలకంఠాపురంలో విషాదం

బుచ్చయ్యపేట : పరవాడలో ఫార్మా వ్యర్థాలు పీల్చి నీలకంఠాపురం గ్రామానికి చెందిన యువకుడు పడాల హరినాథ్ మృతి చెందడంతో నీలకంఠాపురం గ్రామంలో విషదఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుడి మృతితో తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-చోడవరం : ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 10 వారాలుగా పేమెంట్లు చెల్లించలేదని, వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మండలంలోని అంబేరుపురం, దుడ్డుపాలెం గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పని ప్రదేశాల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వి నాయుడు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.54 కోట్లు మేరకు ఉపాధి హామీ వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. 10 వారాలుగా కూలి డబ్బులు చెల్లించకపోతే కూలీలు ఏమి తిని బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సకాలంలో బకాయిలు చెల్లింపులు చేయని అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర మోడీ ప్రభుత్వం నిధులు కోతపెట్టి నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, నర్సింగరావు అదికసంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

50 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం


ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాక రెవెన్యూ పరిధి చింతపాక, గున్నంపూడి, గుడ్డిప తదితర గ్రామాల్లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 50 ఎకరాల్లోని సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు 40 లక్షల నుండి 50 లక్షల రూపాయల వరకు నష్టం సంభవించినట్లు రైతులు వాపోతున్నారు. బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో సరుగుడు తోటకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో చింతపాక గ్రామానికి చెందిన కొంగ నాగరాజు, కొంగ రాజబాబు, కొంగ రమణ, సలది సత్యం, బండారు సత్యవతి తదితర 50 మందికిపైగా రైతులకు చెందిన 50 ఎకరాలకు పైగా సరుగుడు తోటలు కాలిపోయాయి. అగ్ని ప్రమాదాన్ని నివారించడానికి అగ్నిమాపక శకటాలు వచ్చినా వెళ్లే దారి లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిపోయింది. రైతులు నానా విధాలుగా ప్రయత్నం చేసి మంటలను అదుపులోనికి తెచ్చారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న సమయంలో తోటలు కాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ శివారు బలిజపాలెం గ్రామంలో శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయం 3వ వార్షికోత్సవం వేడుకలు ఆలయ ధర్మకర్తలు వైస్ ఎంపీపీ-2 మామిడి లక్ష్మి కొండాజీ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేనాపతి దుర్గ అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు గండి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి శంకరరావు, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చేపడుతున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఈ రక్తదాన శిబిరంలో 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ గొంప వెంకటరావు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు ఎం.కొండబాబు, జూరెడ్డి దివాకర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు



ఉద్యోగ మేళా కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఉద్యోగ మేళా వార్షిక కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉద్యోగ మేళా వార్షిక క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నెలలో రెండు ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

బుర్రకథ అప్పలనాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు సోదరులు మిడతాడ అప్పలనాయుడు (బుర్రకథ) గతనెల 30న ఆదివారం మృతి చెందగా, బుధవారం గ్రామంలోని స్వగృహంలో పెదకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ గండి బాబ్జి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పలువురు నాయకులు బుర్రకథ అప్పల నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, గండి వంశీ దీప్, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, గండి ముత్యాలనాయుడు, రొంగలి దేముడు బాబు, దొడ్డి సూర్య ప్రకాష్, గొర్లి చైతన్య, బైలపూడి దేముడు, బంతికోళ్ల పద్మ, గండి దేముడు, బోకం జోగినాయుడు, లాలం నాయుడు, సబ్బవరపు నరసింహమూర్తి, పల్లా రమణ, సబ్బవరపు రమణ పాల్గొన్నారు.

రెండో రోజుకు పయనీర్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆవరణలోని పయనీర్ లాజిస్టిక్ పరిశ్రమలో వేతనాలు, బోనస్ తదితర సమస్యలపై పరిశ్రమ ఆవరణలో సమ్మె తలపెట్టిన కార్మికులు రెండవ రోజు బుధవారం కొనసాగించారు. ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లు చేయాలని, నైట్ షిఫ్ట్ అలవెన్స్ వంద రూపాయలు చెల్లించాలని కోరారు. ఏమైనా అడిగితే రిజైన్ చేసి వెళ్ళిపోమంటున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. బుధవారం పరిశ్రమ ప్రతినిధులు కార్మికులతో చర్చలు జరిపారు. చర్చిలలో కొన్ని సమస్యల పరిష్కారానికి పరిశ్రమ ప్రతినిధి వర్గం ముందుకు వచ్చినట్లు తెలిసింది. మిగిలిన డిమాండ్లు పరిష్కారానికి పరిశ్రమ యాజమాన్యం శుక్రవారం వస్తున్నట్లు వారితో చర్చలు జరిపి సమస్యలన్నీ పరిష్కారం చేయడానికి వీలవుతుందని చెప్పారు.

రుషీల్ డెక్కర్ కంపెనీలో అగ్ని ప్రమాదం

సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు డిమాండ్



కంపెనీ వద్ద మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్చుతాపురం ఎస్‌ఈజెడ్‌లోని రుషీల్ డెక్కర్ లిమిటెడ్ ప్లైవుడ్ పరిశ్రమలో పది రోజులుగా షడ్ డౌన్ పనులు చేసి మంగళవారం ట్రైలు వేస్తున్న సమయంలో ఇన్సులేషన్ మీద ఫెర్మిక్ ఫియల్ ఆయిల్ పడి మండి బాయిలర్ అగ్నిప్రమాదానికి గురైంది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో కార్మికులు భయభ్రాంతులకు గురయ్యారు. కంపెనీ పూర్తిస్థాయిలో ప్రొడక్షన్‌లో ఉండి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేది. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, ఉపాధక్షులు ఆర్.రాము పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో మండే స్వభావం గల ప్లై వుడ్, కర్ర వేల టన్నులు ఉన్నాయని, ఈ ప్రమాదం పెద్దది అయితే చుట్టుపక్కల కంపెనీలు, గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం జరిగి ఉండేది, కాబట్టి దీనిపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో నిరంతరం ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వ యంత్రాంగం భద్రతా ప్రమాణాలు పాటించని ఆరోపించారు. ఇప్పటికైనా భద్రత లోపాలున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పారదర్శక దర్యాప్తు చేయాలి

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-చోడవరం : పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని, క్రైస్తవులపై మతోన్మాద శక్తులు దాడులు ఆపాలని కోరుతూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన బుధవారం చోడవరం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఎం చర్చ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదగా కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు పాస్టర్ ఎం.నోవహు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెంది రెండు వారాలు గడుస్తున్నా నేటికీ ఆ కేసు వివరాలను పోలీస్ శాఖ తెలియపరచక పోవడం దారుణమన్నారు. ఈ కేసును నీరు గార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. క్రైస్తవ సమాజం యావత్తు పాస్టర్ ప్రవీణ్ మృతిని హత్యగా భావిస్తుందని, ఈ మృతిపై పోలీసులు నిగ్గు తేల్చవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దేశంలో అందరి క్షేమం కోసం శాంతి, ప్రేమ, సహనంతో ముందుకు వెళ్తున్న క్రైస్తవులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. పాస్టర్ యేసు రాజన్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ, సిఐడిలతో విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు నోవహు, భూషణం, ఆకుల, పాస్టర్ ఎం.హెూసన్నా, యేసు రాజన్, బి.యేసుపాదం, బి.రవికుమార్, ఎన్.అజయ్ ప్రసాద్, కృపా శేఖర్, జై ప్రసాద్ పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న క్రైస్తవులు

నిర్వాసితుల సమస్యలపై కోర్టును ఆశ్రయిస్తాం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణలో స్థలాలు, గృహాలు నష్టపోయిన నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయలేని పక్షంలో అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని నిర్వాసిత నాయకులు స్పష్టం చేశారు. ఆర్డీఓ, వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు మండలంలోని చౌడపల్లి, హరిపాలెం, తిమ్మరాజుపేట తదితర గ్రామాలలో నిర్వహించిన గ్రామసభల్లో నిర్వాసితులు, నాయకులు మాట్లాడారు. ప్రతి గ్రామసభలోనూ టిడిఆర్ బాండ్లు వద్దని, నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని అధికారులు ఎదుట నిర్వాసితులు గోడు వినిపించారు. రహదారి విస్తరణపై ప్రజలను చైతన్యపరచడానికి సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం నాయకులు కె రామ సదాశివరావు, కాంగ్రెస్ నాయకులు తనకాల అనంతరావు పాల్గొన్నారు.

నాడొకటి చెప్పారు.. నేడొకటి చెబుతున్నారు

మునగపాక : నాడు ఒకటి చెప్పి నేడు ఒకటి చెబుతున్నారని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులతో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో జరిగిన నాటి నిర్వాసిత గ్రామాల సభలలో గజం ఒక్కంటికి రూ.18,500 నష్టపరిహారం ఇచ్చేందుకు రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారని గుర్తు చేశారు. నేడు తిరిగి టిడిఆర్ బాండ్లు తెరపైకి తీసుకురావడం అన్యాయమన్నారు. నగదు రూపంలో పరిహారం ఇవ్వకుంటే రోడ్డు విస్తరణకు తమ భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషా, వీఎంఆర్డీఏ ఏపీవో అమ్మాజీ రావు, ఎమ్మార్వో ఆదిమహేశ్వరరావు, నిర్వాసితులు ఆడారి గణపతి అచ్చంనాయుడు, బొడ్డేడ రామచంద్రరావు, పెంటకోట జగన్నాథం నాయుడు, కాండ్రేగుల జగన్, బొడ్డేడ సోమ సుందర రావు, ఆడారి శ్రీరాములు, ఆడారి అప్పలనాయుడు, వేగి వీరు నాయుడు, టెక్కలి గంగు నాయుడు, మాఊరు సూరిబాబు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఆయేషా

ప్రజా దర్బార్‌కు 160 వినతులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుండి 160 వినతిపత్రాలు అందాయి. వీట్లో ఎక్కువగా రెవిన్యూ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నాయి. ముందుగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పనులు చేయడంలో ఇబ్బందులు సృష్టించొద్దని హితవుపలికారు. గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు ఉంటాయని వాటిని స్థానికంగా వీఆర్వో, ఎమ్మార్వో స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా దర్బార్లో ఇచ్చిన ప్రతి ఫిర్యాదుకు ఖచ్చితమైన సమాధానం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దారు రమేష్ బాబు, టిడిపి నాయకులు రొంగలి మహేష్, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, సర్పంచులు బొడ్డు అక్కునాయుడు, దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ బుధవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. టీడీపీ శ్రేణుల వినతులను స్వయంగా ఆయన తీసుకున్నారు. వాటిపై అధికారులతో మాట్లాడారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన టీడీపీకి చెందిన కశింకోట మండలం, బయ్యవరం గ్రామానికి చెందిన వెంకట అప్పారావు, అనకాపల్లి పట్టణం, గవరపాలెంకి చెందిన భీశెట్టి జోగారత్నం, కశింకోట గ్రామానికి దేవర అయ్యప్పలకు కార్యకర్తల సంక్షేమ నిధి నుండి ఆదుకోవాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 14న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతోత్సవం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి 4 రోడ్ల కూడలి, నెహ్రూ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలాంకరణ చేయడం, అనంతరం ఉదయం 10 గంటలకు స్థానిక గుండాల జంక్షన్, ఎస్‌ఆర్.శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్ నందు జయంతోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా 12వ రోజు అన్నమాచార్య సంకీర్తనలు, కోలాటాలు నిర్వహించారు. ఇవి భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీమన్నారాయణ అన్నమయ్య సంస్థాన పి నాగలక్ష్మి, యల్ వరలక్ష్మి, శంకర మఠం, శ్రీ నిర్మల నృత్య నికేతన్, డాక్టర్ బి విజయ జ్యోతి, చిన ముసలివాడ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్ కుమార్, డాక్టర్ డిడి నాయుడు, బిఎస్ఎంకె జోగి నాయుడు, ఎం కామరాజు, నూకంబిక దేవస్థానం ఛైర్మన్ పీల నాగ శ్రీను, తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవిందరావు, గండెపల్లి మురళి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా కట్టమూరి

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షులుగా కట్టమూరి నూకప్పారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నట్లు కట్టమూరి నూకప్పారావు తెలిపారు. ఈ పదవి తనకు ఇవ్వడం పట్ల మరింత బాధ్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల, జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

లెక్కల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-యలమంచిలి : విద్యార్థుల్లో లెక్కల పట్ల ఉన్న భయాన్ని దూరం చేసే విధంగా 'పింగ్స్ ఫౌండేషన్' వారిని ప్రోత్సహిస్తూ జిల్లాలోని అనేక పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తూ వారికి బహుమతులు అందజేస్తుందని జంపపాలెం హైస్కూలు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణారావు తెలిపారు. బుధవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఇటీవల 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన లెక్కల పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు సర్టిఫికేట్, జికె బుక్స్, క్యాష్ ప్రైజ్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి ఎం.జయప్రకాష్, ఉపాధ్యాయులు బొడ్డేటి సత్యనారాయణ, నాగరాజు, చిట్టిరాజు, శివ, సుధాకర్, సుబ్బారావు, నూకరాజు పాల్గొన్నారు.

కేసుల పురోగతిని సిసిటిఎన్ఎస్‌లో నమోదు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని సిసిటిఎన్ఎస్‌లో సమయానికి నమోదు చేయాలని ఎపి రాష్ట్ర ఐజి ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ జి.పాలరాజు అన్నారు. అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంత నేర సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న పాలరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగులు సిసిటిఎన్ఎస్ ఆధారంగా నిర్వహించనున్నందున ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలు దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తులో నిందితుల ఫోన్ నంబర్, ఇమెయిల్ ఐడి, ఐపీ అడ్రస్ ఆధారంగా త్వరితగతిన లోకేషన్ గుర్తించి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, పండుగలు, జాతర్ల వద్ద నిఘా పెంపు చేయాలని, పేకాట, ఓపెన్ డ్రింకింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రముఖ ఆలయాలు, ప్రార్థన స్థలాలు, లేడీస్ హాస్టళ్ల భద్రత కోసం సీసీ కెమెరాలు, లేడీస్ హాస్టల్స్ భద్రతాకు వాచ్‌మెన్ ఏర్పాటు చేయించాలని కోరారు. మిస్సింగ్ కేసుల్లో ఆలస్యం లేకుండా తక్షణమే దర్యాప్తు ప్రారంభించాలన్నారు. హత్య, రేప్, గంజాయి, రాబరీ, దొంగతనాలు, పోక్సో కేసుల్లో నిందితులపై ప్రత్యేక దృష్టి పెట్టి, అవసరమైతే రౌడీ/హిస్టరీ షీట్లు ప్రారంభించాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణుస్వరూప్, ట్రైనీ డిఎస్పీ ఎంవి.కృష్ణ చైతన్య, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, లక్ష్మి, రమేష్, గఫూర్, ఎస్సైలు ప్రసాద్, సురేష్, వెంకన్న, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-సబ్బవరం, కశింకోట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలు ఈనెల 13న ఆదివారం నిర్వహిస్తున్నట్లు సబ్బవరం గురుకులం ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, కశింకోట మండలం తాళ్లపాలెం గురుకులం ప్రిన్సిపాల్ జి గ్రేస్ బుధవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష 5వ తరగతికి ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. https://apbragcet.apcfss.in నుండి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగా సెంటర్‌కు రావాలని, హాల్ టికెట్, ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో హాజరు కావాలని కోరారు. సబ్బవరం సెంటర్‌లో 5వ తరగతికి 229 మంది, 11వ తరగతికి 231 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.

నవోదయలో సీటు సాధించిన విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-వడ్డాది : జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలలో ప్రతిభ కనబరిచి సీటు సాధించిన వడ్డాదికి చెందిన విద్యార్థిని పులిగా పుణ్యకీర్తనను బుధవారం టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ సాలువతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని చిన్నారిని ఆశీర్వదించారు. పులిగా శ్రీనివాసరావు, పద్మజ దంపతుల కుమార్తె పుణ్య కీర్తన ఈఏడాది జనవరిలో జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో 90శాతంపైగా మార్కులతో విశాఖపట్నం కొమ్మాదిలో ఉన్న నవోదయ స్కూల్లో అడ్మిషన్ సాధించింది. పుణ్య కీర్తన స్థానిక పిఎంఎస్ మోడల్ స్కూల్లో నవోదయ కోచింగ్ తీసుకుంది. ఈ కార్యక్రమంలో సాయం శేషు, తలారి శంకర్, హైస్కూల్ ఛైర్మన్ కోవెల వెంకటరమణ పాల్గొన్నారు.

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలి

ఫ్యాక్టరీ వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌ను కొనసాగించాలని, రైతులకు బకాయి పేమెంట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోవాడ ఫ్యాక్టరీ వద్ద సిఐటియు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ అనేక అవాంతరాలతో జరుగుతుందని, రైతులు ఎంతో కష్టపడి పండించిన చెరుకు రోజుల తరబడి ఉండిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై రైతు సంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో గత నెల 21వ తేదీన మహాధర్నా సందర్భంగా క్రషింగ్ అవాంతరాలు లేకుండా చేస్తామని, రైతులకు పేమెంట్లను చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాని రైతులకు ఈ ఏడాది ఇప్పటి వరకు తోలిన చెరుకుకు సుమారు రూ.36 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.5 కోట్లు మాత్రమే చెల్లించారని తెలిపారు. తక్షణమే బకాయి ఉన్న మొత్తం పేమెంట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వి. నాయుడు మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న చెరుకు పూర్తయ్యే వరకు క్రషింగ్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమణ, రాజు, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల మాఫియాను కట్టడి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజల ఆరోగ్యాలకు హానికరంగా మారిన చికెన్, మాంసం వ్యర్థాల ముఠా కార్యకలాపాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కృత్రిమంగా ఏర్పాటు చేసిన చెరువులు, కుంటలలో పెంచే చేపలకు చికెన్ వ్యర్థాలను మేతగా వేస్తుండడంతో నేడు కొంత మంది ఈ వ్యర్థాల సేకరణను ఒక వ్యాపారంగా మార్చుకున్నారని తెలిపారు. ఈ ముఠా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక వాహనాల్లో చికెన్ దుకాణాలకు వెళ్లి అక్కడ ముందుగానే ఏర్పాటు చేసుకున్న భారీ ప్లాస్టిక్ డ్రమ్ముల్లో కోళ్ల నుంచి తీసిన పేగులు, తల, కాళ్లు, చర్మం, ఈకలు వంటి వ్యర్థాలను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యర్థాలను ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతో పాటు, పొరుగు జిల్లాల్లోని కృత్రిమ చెరువుల్లో చేపలు పెంపకందారులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. పవర్ ఆఫ్ ఆర్టీఐ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్లో చికెన్ వ్యర్థాల మాఫియా దందా బయటపడిందని తెలిపారు. ఈ వ్యర్థాల మేతతో పెరిగిన చేపలను మనుషులు తింటే క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, మత్స్యశాఖ తదితర శాఖల అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు మామూళ్ల మత్తులో నుంచి కళ్ళు తెరిచి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మాంసం వ్యర్థాల మాఫియాను కట్టడి చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

డైట్‌లో ఇసిఇ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆఖరి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమం విద్యార్థుల అకడమిక్ ప్రయాణం, విజయాలు, జ్ఞాపకాలతో నిండిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమం ముగింపు భాగంలో గ్రూప్ ఫోటో, జ్ఞాపికల పంపిణీ, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ ఎలిమెంటరీ స్కూల్ భవన నిర్మాణ పనులకు బుధవారం గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి, విద్యా కమిటీ ఛైర్మన్ ఆలేటి వరలక్ష్మి భూమి పూజ చేశారు. రూ.13 లక్షలతో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎస్.శివబాబు నాయుడు, ఎస్ నాగార్జున, మారిశెట్టి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఉచిత పాఠ్య పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీధర్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పి.సుభాషిని చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న విజయ్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి స్థానికంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వంటి సత్తా నాయకులతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పేర్కొన్నారు. 27వ వార్డు శివపురంలో రూ.45లక్షలు, 24వ వార్డు అయ్యన్నపాలెంలో రూ.45లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కౌన్సిలర్ చింతకాయల విజయ్ పద్మావతితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రోడ్లు వెడల్పు పేరుతో మున్సిపల్ నిధులు వ్యయం చేసి, దుబారా చేశారన్నారు. శివపురం సమీపంలో కల్వర్టు దెబ్బతింటే తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇందుకుగాను కొత్తగా నిర్మాణానికి రూ.50లక్షల నిధులు కేటాయించారని, ఆ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయన్నారు. తలుపులమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని సైతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. అయ్యన్నపాలెం శ్మశానం అభివృద్ధికి స్పీకర్ రూ.10 లక్షల నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ కాశీరత్నం, పైలా గోవింద్, తాతీలు మాస్టారు, 24వ వార్డ్ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, దనిమిరెడ్డి బుజ్జి, వార్డు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని..

ఉపాధి హామీ కూలీల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎన్.నర్సాపురంలో జరుగుతున్న ఉపాధి పనులు వద్ద కూలీలతో బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో ఉపాధి కూలీలకు నాలుగు కోట్లు రూపాయలు వేతనాలు బకాయి ఉందని, జిల్లాలో 80 కోట్ల రూపాయలు వేతనాలు బకాయి ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. నెలల తరబడి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులతో సతమతమవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చేసిన పనికి పదిహేను రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ, అమలు చేయకుండా కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని లేకుంటే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణ, దుర్గ, అప్పారావు, దేముడు బాబు, బాబూరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కూలీలు, నాయకులు

ఎఇగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -రావికమతం:రావికమతం విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ ఏఈగా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన నందన్ ప్రమోషన్ పై పార్వతీపురం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో విద్యుత్ శాఖ పరంగా సమస్యలు పరిష్కా రానికి తన వంతు కృషి చేస్తానని, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



13న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సువర్ణ కుమారి తెలిపారు. నక్కపల్లి గురుకులం బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 2 గంటల నుండి 4.30 వరకు పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్లైన్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.


పుస్తకాలు ఇస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు టెస్ట్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బ్రిడ్జి కోర్సులో భాగంగా పుస్తకాలు పంపిణీ చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. అదేవిధంగా కళాశాలలో జాయిన్ అయ్యే విద్యార్థులకు అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి


ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం గ్రామానికి చెందిన ఆవాల లక్ష్మి మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు కుమారుడు ఆవాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు వెల్లడించారు. సీఐ, ఎఎస్ అందించిన వివరాల మేరకు.. ఉద్దండపురం గ్రామానికి చెందిన ఆవాల సురేష్, వెలంశెట్టి శ్రీను వేరువేరుగా ప్రైవేట్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈనెల 4వ తేదీన గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. గ్రామ పెద్దల సమక్షంలోనూ ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. అదే రోజు రాత్రి ఆవాల సురేష్ తల్లి లక్ష్మికి కడుపు నొప్పి రావడంతో స్థానిక ప్రైవేటు వైద్యునికి చూపించగా, నయం కాకపోవడంతో నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్సను అందించి, మెరుగైన వైద్యం కోసం తుని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కేజీహెచ్ కు తరలించారు. ఆమె తల్లికి నయం కాకపోవడంతో మంగళవారం కేజీహెచ్ నుంచి ఆమె తల్లిని తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈనెల నాలుగో తేదీన జరిగిన ఘర్షణలో వెలంశెట్టి శ్రీను తన పైన, తన తల్లి లక్ష్మి పైన దాడి చేయడంతోనే ఆమె గాయపడి మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలు కుమారుడు ఆవాల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మృత దేహాన్ని కేజీహెచ్ కు తరలించి పోస్టుమార్టం చేయిస్తామని, రిపోర్టు మేరకు చర్యలు చేపడతామని సిఐ వెల్లడించారు.


మృత దేహాన్ని పరిశీలిస్తున్న సిఐ

ఆలయాల్లో ఘనంగా కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామంలో భువనేశ్వరీ దేవి సమేత శ్రీలక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్ద మంగళవారం రాత్రి 10 గంటల నుండి ఒంటిగంట వరకు శివయ్య కళ్యాణాన్ని నిర్వహించారు.ఆలయ అర్చకులు మహేష్, సంతోష్ ఆధ్వర్యంలో వేద పండితులు భగవాన్ శర్మ, పండు శర్మ, ప్రసాద్, ప్రణవ్ నేతృత్వంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కొప్పిశెట్టి వెంకటేష్, హేమ దంపతులు శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో 17వ శతాబ్దంలో నిర్మించిన కోదండ రాముని ఆలయంలో మంగళవారం రాములవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు, పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు, ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, జానకి హరి పాల్గొన్నారు.


కోటవురట్లలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి సూర్యనారాయణ

ఆలయం, రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో గుడ్డిప పంచాయతీ శివారు గదబపాలెం గ్రామంలో సిద్ది వినాయక స్వామి నూతన గుడి నిర్మాణానికి గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో సిద్ధి వినాయక స్వామి గుడి నిర్మాణానికి భూమి పూజ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు పాల్గొన్నారు.

రావికమతం : మండల పరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి గొంప ఎంపిటిసి గెంజి సూర్య నారాయణ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, గొంప గ్రామంలో రూ. 2 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు ఈ రోడ్డు నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చేపూరి భీమ నాయుడు, కలగా రాజు,కలగా రమణ, కలగా చిరంజీవి, జనసేన పార్టీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 10వ తేదీ గురువారం మరమ్మత్తు పనులు, కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మ్ ఏర్పాటు చేయడంతో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్కో ఎఇ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, జీజే పురం, చీడిక రేవల్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అర్హులైన సాగుదారులందరికీ నష్టపరిహారం చెల్లిస్తాం

-తహశీల్దార్ నరసింహమూర్తి



ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా నష్టపరిహారం అందని అర్హులైన సాగుదారులు ఉంటే వారి జాబితాను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి చెల్లిస్తామని తహసీల్దారు నరసింహమూర్తి తెలిపారు. రాజయ్యపేటలో కారిడార్ రోడ్డు పనులు అడ్డగింత అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం వార్త ప్రచురణ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్ నరసింహమూర్తి ఈ వార్తకు స్పందించారు. రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయబోతున్న బల్క్ డ్రగ్ పార్క్ రాష్ట్ర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని, ఎంతోమందికి ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి సంబంధించి దీర్ఘకాలిక లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందన్నారు.సదరు భూసేకరణ జరిగిన ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారం నష్ట పరిహారం చెల్లించడమైందని, అదేవిధంగా ఇళ్ళు కోల్పోయిన వారిని కూడా గుర్తించడమైందని, వారికి ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, నిర్వాసితులకు వేరే చోట భూమిని కూడా కేటాయించడం జరుగుతుందని వెల్లడించారు.ప్రస్తుతం రాజయ్యపేటలో సాగుదారుల ఆందోళనల నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారం అందని అర్హులైన సాగుదారులు ఎవరైనా ఉన్నట్లయితే వారి వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. విస్తరణ పనులు యథావిధిగా జరుగుతున్నాయని తెలియజేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నారాయణమూర్తి, నేతలు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మజ్జిగ చలి వేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దొండ నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోవెల జనార్దన్‌రావు, పలుకూరి బంగారాజు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, పల్లెలు జోగారావు, దొండా గోదావరిబాబు, సయ్యపురెడ్డి రాజా, గుమ్మడి ప్రసాద్, దొండా గణేష్, కోవెల సత్యనారాయణ, పినపాత్రుని రమణబాబు, దొండ వరహాలుబాబు, అడప వరహాలుబాబు, కోవెల జయబాబు, ఆదిత్రావ్ రాజా, దొరబాబు, తెప్పల నాగేష్, గండి బోయిన శ్రీనివాసరావు, షేక్ అప్పసాయిబు, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆట వస్తువులు ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ 2వ వార్డు బీసీ కాలనీలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను చింతకాయల విజయ్ సందర్శించారు. ఆట వస్తువులు కావాలని విద్యార్థుల కోరిక మేరకు వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్ లాలం మురళీ, వార్డు పెద్దలుచేతుల మీదుగా ఆట వస్తువులను విద్యార్థులకు అందజేశారు.

గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై నిరసన



నక్కపల్లిలో నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం రాజయ్యపేటలో గ్యాస్ బండలతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై గుదిబండ వేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే సామాన్య, మధ్య తరగతి ప్రజలు చేయడానికి పనులు లేక పెరిగిన నిత్యావసర ధరలతో సతమతం అవుతుంటే గోరుచుట్టు మీద రోకలి పోటు లాగా గ్యాస్ పై 50 రూపాయలు, పెట్రోల్, డీజిల్ పై 2రెండు రూపాయలు పెంచిందని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మండల కమిటీ సభ్యులు ఎం. మహేష్, నూకరాజు, అప్పారావు, వీరబాబు, జగ్గ, స్వామి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : పెంచిన వంటగ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి 59 వ వార్డు నెహ్రూనగర్ జంక్షన్‌లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ, నిరసన చేపట్టారు. పార్టీ మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ఇప్పటికే ధరలు, ఛార్జీల భారంతో అల్లాడుతున్న సామాన్యులపై కేంద్రం వంటగ్యాస్‌భారం వేయడం దుర్మార్గమన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతుంటే, ఇక్కడ పెట్రో ఉత్పత్తులపై వాత పెట్టడం అన్యాయమన్నారు. నిరసనలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కె.రమణ ఆర్.విమల, కార్యకర్తలు బి రాంబాబు, బి సూరిబాబు, డి రాము, డి రాజు, సిహెచ్



మల్కాపురంలో...



పెందుర్తిలో...

పైడినాయుడు వెంకటేష్ స్థానిక మహిళలు పాల్గొన్నారు

ములగాడ : వంటగ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలని కోరుతూ మల్కాపురం జంక్షన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో పార్టీ జిల్లా సమితి సభ్యులు గండి అప్పారావు, నూనెల సూరిబాబు, వై కనకేశ్వరరావు, చంద్రశేఖర్, సూరిబాబు, సత్తిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు

పెందుర్తి: వంటగ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పెందుర్తి శాఖ కార్యదర్శి ఎన్. అసిరినాయుడు, గిరిప్రసాద్ నగర్ కార్యదర్శి ఎ.అన్నపూర్ణ, పార్టీ నాయకులు ఎన్.అరుణ, శ్రీరామ్, జ్యోతి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగా గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 14 నుంచి గ్రామాల్లో జరిగే గ్రామసభలను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ప్రజా సంకల్ప వేదిక(ఆర్‌పిఐ) జిల్లా ఉపాధ్యక్షులు ఎండిఎ.అన్వర్ కోరారు. బుధవారం నర్సీపట్నం ఎండీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ, ఈ గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా




వినతిపత్రం అందజేస్తున్న అన్వర్

చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని శాఖల అధికారులు హాజరైనప్పుడే గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ గ్రామసభలను వారం రోజుల పాటు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఒక రెండు రోజుల్లోనే ముగించడం సరి కాదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో తెలియజేయడం జరిగిందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని నెల్లిపూడి గ్రామంలో విద్యుత్ షాక్‌తో తాడి పెద్దు మృతి చెందింది. ఈ మేరకు బుధవారం గ్రామానికి చెందిన యాదవ సంఘం, తప్పెడగుళ్ళు కళా కారుల ఆధ్వర్యం లో మృతి చెందిన తాడి పెద్దును గ్రామం లో ఊరేగిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేష్ వర్మ పాల్గొన్నారు.



మృతి చెందిన ఎద్దు

అంతా జగన్నాటకమే..

హెలికాప్టర్ వివాదంపై హోంమంత్రి అనిత

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి డ్రామాలాడుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తంచేశారు. హెలికాప్టర్ వివాదంపై విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్‌రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇవ్వామని తెలిపారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని వివరించారు. వివిపిని తీసుకెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ అన్నారని, తర్వాత 15 నిమిషాల్లో అది ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందన్నారు. వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని, కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. జగన్ ఎక్కడికి వెళ్తామన్నా తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు.

ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపిసి కన్నా వైసిపి కోడ్ అమలైందన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్‌రెడ్డి సంస్కృతి అని, తమది కాదని స్పష్టం చేశారు. పోలీసులను బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మీటింగ్ పెట్టి, పార్టీ, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని, ఎవరూ బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా అనిత గుర్తు చేశారు.



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

స్పీకర్ అయ్యన్నకు వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రాష్ట్రవ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇప్పించే విధంగా సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్లు, సిబ్బంది బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును కోరారు. ఈ మేరకు స్పీకర్‌కు వినతిపత్రం అందజేశారు. . ఉద్యోగుల అభ్యర్థనను సంబంధిత మంత్రి నారా లోకేష్‌కి సిఫారసు చేస్తానని పెన్షనర్స్‌కి హామీ ఇచ్చారన్నారు. స్పీకర్‌ని కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వర రావు, కోశాధికారి కాకి అప్పారావు, రాష్ట్ర నాయకులు వి.పైడిరాజు, ఆర్.కన్నబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్‌వి.నరసింహం, ఉపాధ్యక్షులు, స్థానిక లైబ్రేరియన్ పి.దమ యంతి, కె. త్రిమూర్తులు, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

హోంమంత్రిగా అనిత విఫలం

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర హోంమంత్రిగా అనిత విఫలమయ్యారని ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు వరుదు కల్యాణి ఆరోపించారు. వైసిపి విశాఖ నగర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అఘాయిత్యాలు, ప్రతీకార హత్యలు, దాడులతో అట్టుడుకుతుంటే హోంమంత్రి రాజకీయ విమర్శలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి, తెలుగుదేశం పార్టీ రాజకీయ సంస్థగా దిగజార్చారని ఆరోపించారు. హోంమంత్రి అనిత తన బాధ్యతలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విమర్శించడానికే పరిమితమయ్యారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి కేవలం పులివెందుల ఎమ్మెల్యే అంటూ కించపరిచేలా అనిత మాట్లాడుతున్నారని, ఆయన మాజీ ముఖ్యమంత్రిగా, జనంలో అత్యంత ఆదరణ కలిగిన నాయకునిగా కొనసాగుతున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు.



ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ మాజీ ముఖ్యమంత్రి గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి ఉందంటే, ఏ రకంగా పోలీస్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం సాధనంగా మార్చారో అర్థం చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి పర్యటనల్లో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేస్తోందని ఆరోపించారు.